క్లుప్తంగా

గజ్వేల్‌కు చేరుకున్న ఇంటర్ ప్రశ్నపత్రాలు



ఇంటర్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచేందుకు తీసుకెళ్తున్న అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం ఇంటర్‌బోర్డు నుంచి ప్రశ్న పత్రాలు గజ్వేల్‌కు చేరుకున్నాయి. వాటిని పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల హబ్‌లోని బాలికల జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్(కళాశాల), గీతాంజలి, విశ్వతేజ, జీఎంఆర్, ప్రగతి, జ్ఞాన సరస్వతి, నాగార్జున జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరగనున్నాయి.

నాచగిరి వ్రతశోభితం



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో శనివారం సత్యనారాయణ స్వామి వ్రతాల సందడి నెలకొంది. మాఘ పౌర్ణమి కావడంతో శ్రీలక్ష్మీనృసింహస్వామివారి సన్నిధిలో వ్రతమాచరించేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలాచరించిన దంపతులు వ్రతమాచరించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం గర్భగుడిలో శ్రీలక్ష్మీనృసింహులను దర్శించుకున్నారు. శనివారం క్షేత్రంలో 38 వ్రతాలు జరిగినట్లు ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

నంగునూరు(సిద్దిపేట): కోనాయిపల్లి వేంకటేశ్వరాలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, నిత్యహోమం, మహా పూర్ణాహుతి, బలిహరణం, చక్రస్నానం, ద్వాదశ ఆరాధన, ఏకాంత సేవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి మంత్రి పొన్నం కృషి



పందిల్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ శివయ్య

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కృషి చేస్తున్నారని హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. శనివారం పందిల్ల గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్‌లు మడప జయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, కుమారస్వామి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

దౌల్తాబాద్(దుబ్బాక): గజ్వేల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బాలాజీ శనివారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. మొదటిసారి పోలీస్‌స్టేషన్‌కు రావడంతో సీఐ లతీఫ్, ఏఎస్‌ఐ సాయిలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ సక్రమంగా అమలు చేయాలని సూచించారు.



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న గజ్వేల్ ఏసీపీ బాలాజీ

పర్యావరణానికి ముప్పు

పెరుగుతున్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పర్యావరణానికి పెను ముప్పుగా మారింది. ఏ వస్తువు కొనుగోలు చేసినా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తుండటంతో వినియోగదారులు ఇంటి నుంచి సంచులు తీసుకెళ్లడం మానేశారు. వాటిని వాడిన వినియోగదారులు బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుంటంతో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంపై సరైన అవగాహన లేకపోవడంతో పర్యావరణంతోపాటు ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- దుబ్బాక



చెత్త కుప్పలో ప్లాస్టిక్ వ్యర్థాలు

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- అవగాహన కల్పిస్తున్నా పట్టింపులేమి
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- చర్యలు చేపట్టాలని డిమాండ్

ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రభుత్వ ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితం రావడం లేదు. స్థానికంగా అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటి వినియోగం తగ్గడంలేదు. ప్రయత్యామ్నాయంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రత్యామ్నాయంగా స్టీలు, పేపర్, జనపనారతో చేసిన వస్తువులు వినియోగించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ వేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం సమస్త జీవరాశిపై తీవ్రప్రభావం చూపుతుందంటున్నారు. పేపర్, జనపనారతో చేసిన వస్తువులు చాలా త్వరగా మట్టిలో కలిసిపోతుందని, ప్లాస్టిక్ మాత్రం అందుకు భిన్నమంటున్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలో రోజూ సేకరించే చెత్తలో అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం కలవరపెట్టే అంశం. కిరాణా, చికెన్, కూరగాయల విక్రయదారులు అధిక శాతం ప్లాస్టిక్ కవర్లను విరివిరిగా వాడుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను వాడిన తర్వాత రోడ్లపై పడేస్తుండటంతో పశువులు చెత్తతోపాటు వాటిని తిని మృత్యువాతపడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నా ప్రజలు ప్లాస్టిక్ కవర్లనే వినియోగించడం గమనార్హం. ప్లాస్టిక్ శాశ్వత నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించేలా ప్రభుత్వమే తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్ రహిత దుబ్బాకకు సహకరించాలి



ప్లాస్టిక్ నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కళాజాతల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. దుబ్బాకను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలు తమవంతు సహకరించాలి.

– రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



దిష్టి కుంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ రామాచల గుట్టపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి బ్రహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మేలుకొలుపు, దిష్టి కుంభంతో అర్చకులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ముఖ మండపంలో అన్నపురాశి పోసి దిష్టి కుంభం ఏర్పాటు చేసి పూజలు చేశారు. తొలి రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రామలింగేశ్వరస్వామి నామ స్మరణతో రామాచల క్షేత్రం మార్మోగింది. ఉత్సవాల్లో ఆలయ ఈవో విశ్వనాథశర్మ, అర్చకులు భద్రప్ప, శివప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాక తహసీల్దార్‌గా బాలరాజు

సాక్షి ఎఫెక్ట్

కొండపాక(గజ్వేల్): కొండపాక తహసీల్దార్‌గా బాలరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ శాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఈనెల 15వ తేదీన కొండపాక తహసీల్దార్ శ్రీనివాస్‌ను గజ్వేల్ తహసీల్దార్‌గా, గజ్వేల్ తహసీల్దార్ బాలరాజును కొండపాక తహసీల్దార్‌గా బదిలీ చేసింది. దీంతో ఆదేరోజు కొండపాక నుంచి వెళ్లిన శ్రీనివాస్ గజ్వేల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టగా, బాలరాజు బాధ్యతలు చేపట్టలేదు. ఈవిషయాన్ని గుర్తించిన సాక్షి రెవెన్యూ సేవలు బంద్ శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన కలెక్టరు 21వ తేదీన డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలిమకు భూముల రిజిస్ట్రేషన్ల నిర్వహణకు తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో శనివారం కొండపాకకు బదిలీ అయిన బాలరాజు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.



బాలరాజుకు పూలమొక్క అందజేస్తున్న సిబ్బంది

త్రిపుల్ రైడింగ్ ప్రమాదకరం

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహనాలపై త్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమని, మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గజ్వేల్ పట్టణంలోని రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమన్నారు. యువత డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌ఐ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ..

వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. రాంగ్‌రూట్ ప్రమాదకరమన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ట్రాఫిక్ సీఐ మురళి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయం పాలనలో పాల్గొన్న గజ్వేల్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్‌లో విద్యార్థులు శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగామారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా నరేష్, ఎంఈఓగా జె.ప్రణయ్, హెచ్‌ఎంగా అశ్విత, ఉపాధ్యాయులుగా మణిదీపిక, పూజిత, కావ్య, బ్యూలా, నిహారిక, శృతి, శ్రావణి, అరవింద్, చరణ్, ఈశ్వర్, నరేందర్, ప్రవీణ్, రాజేష్, సమీర్ వ్యవహరించారు. హెచ్‌ఎం స్వప్నారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, స్వప్న, జనార్థన్, విశ్వరూపం, అమరేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

గజ్వేల్‌రూరల్: నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు ఉపాధ్యాయులుగామారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పట్టణంలోని ఎంపీపీఎస్(బాలికలు) పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతామణి, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మీ, సక్రియ, వహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వనదేవతల జాతర

మద్దూరు(హుస్నాబాద్): ఈనెల 21వ తేదీన ప్రారంభమైన కూటిగల్ సమ్మక్క సారలమ్మ జాతర శనివారం సాయంత్రంతో ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న వనదేవతలు తిరిగి వనంలోకి వెళ్లారు. డప్పు చప్పుళ్ల కోయ పూజారులు తమ సాంప్రదాయ పద్ధతిలో వనంలోకి తీసుకువెళ్లారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు, అధికారులకు, గ్రామ పెద్దలకు జాతర కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పాత కామాన్ వద్ద సమ్మక్క సారలమ్మ జాతర శనివారం సాయంత్రం ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న వన దేవతలు జనం నుంచి తిరిగి వనంలోకి చేరుకున్నారు.డప్పు చప్పుల్లు , శివసత్తుల పూనకాలతో ప్రధాన పూజారులు రేణుక, రాములమ్మ, రాజేష్ అమ్మవార్లను వనంలోకి తీసుకువెళ్లారు.



అమ్మవార్లను వనానికి తీసుకువెళ్తున్న మహిళా పూజారులు

గడువు పొడిగింపు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో 2024–25 సంవత్సరానికిగాను 6–10వ తరగతి వరకు దరఖాస్తుల గడువును ప్రభుత్వం మార్చి 2వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సుప్రియ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10వ తగరతి వరకు మిగిలిన సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. మార్చి 2వ తేదీలోగా ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో లేదా http:// telanganams. cgg. gov. in. లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): మెదక్–ఎల్కతుర్తి జాతీయ రహదారి పనుల్లో భాగంగా 11 కేవీ 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల మార్పుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సిద్దిపేట రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఏన్సాన్‌పల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, డీఎక్స్‌ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

పదిలో ప్రతిభ కనబర్చాలి

మైనార్టీ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ మెహరాజ్



మాట్లాడుతున్న మైనార్టీ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ మెహరాజ్

దుబ్బాక: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలోనే మంచి గుర్తింపు తీసుకురావాలని మైనార్టీ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ మమ్మద్ మెహరాజ్ అన్నారు. శనివారం దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు.

యాత్రను జయప్రదం చేద్దాం

- జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ విజయ సంకల్పయాత్ర ఈనెల 26న సిద్దిపేటలోకి ప్రవేశిస్తుందని, ఈ యాత్రను దిగ్విజయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితోపాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు సిద్దిపేటలోని బీజేఆర్ చౌరస్తాకు యాత్ర చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి పాత బస్టాండ్ చౌరస్తా, శివాజీ చౌక్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు శివాజీ చౌక్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు.

గజ్వేల్‌రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్ పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లో వారు మాట్లాడారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాకు ఆదివారం చేరుకోనున్న విజయ సంకల్ప యాత్రకు కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో పాటు నాయకులు రఘునందన్‌రావు, మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈనెల 26వ తేదీన బీజేపీ విజయ సంకల్పయాత్ర సిద్దిపేట జిల్లా కేంద్రంలోకి ప్రవేశిస్తుందని, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం చిన్నకోడూరులో నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో విజయ సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

సిద్దిపేటఅర్బన్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారు టీహెచ్‌ఆర్ నగర్‌లో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సెంట్రింగ్ కాంట్రాక్టర్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన శ్యామ్ రామ్ (21) పనిచేస్తున్నాడు. టీహెచ్‌ఆర్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై సెంట్రింగ్ డబ్బాలను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చేతిలోని ఇనుప రాడ్డు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై భవనంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై త్రీటౌన్ సీఐని సంప్రదించగా కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని, మృతుడి బంధువులు స్థానికంగా లేకపోవడంతో తమకు ఫిర్యాదు అందలేదన్నారు.



శ్యామ్‌రామ్ మృతదేహం

పట్టు పురుగుల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న డాక్టర్ వినోద్‌కుమార్

ములుగు(గజ్వేల్): పట్టు పురుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం, కేంద్ర పట్టుమండలి ములుగు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. ములుగు అటవీ కళాశాల, పరిశోధనా కేంద్రంలో శనివారం రైతులకు మల్బరీ సాగు నైపుణ్యం, అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకంతో ప్రతీనెల ఆదాయం పొందొచ్చన్నారు. మల్బరీసాగు, పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి డాక్టర్ రాఘవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు ప్రశ్నించే ఆయుధం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సిద్దిపేటజోన్: ఓటుహక్కు ప్రాధాన్యతను నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలో ఫ్లాష్ మాబ్ ద్వారా వివరించారు. ముస్తాబాద్ చౌరస్తా, పాత బస్టాండ్, బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో నృత్యం చేస్తూ ఓటు ప్రాధాన్యంపై చైతన్య పరిచారు. అర్హులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, నెహ్రూ యువకేంద్ర ఇన్‌చార్జి కిరణ్, ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్, విద్యాశాఖ మానిటరింగ్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కు ప్రాధాన్యత వివరిస్తున్న విద్యార్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం

దౌల్తాబాద్(దుబ్బాక): సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధమని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం షీ టీం ఆధ్వర్యంలో మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగన్మోహన్, సిద్దిపేట షీ టీం సభ్యుడు కిషన్, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణాకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన బాలస్వామి, మాధవి దంపతుల కుమారుల పుట్టిన రోజు పురస్కరించుకుని శనివారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

◆ 27 నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్‌లో నూతనంగా నిర్మించిన కాశీలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 27వ తేదీన గోపూజ, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు, 28న దేవతా మూర్తులకు, యంత్రాలకు వాస్తు హోమం, పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 29వ తేదీన విగ్రహ, యంత్ర స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి తదితర కార్యాక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

◆ టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

మర్కూక్(గజ్వేల్): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగచైతన్య రెడ్డి ప్రతిభ చాటి తృతీయస్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడంతో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎం లతీఫ్‌సైదా అతడిని అభినందించారు.

◆ కోహెడలో మోస్తరు వర్షం

కోహెడ(హుస్నాబాద్): భూగర్భ జలాలు అడుగంటి సాగునీటి కొరతతో ఇక్కట్లు పడుతున్న రైతులకు శనివారం సాయంత్రం మండల కేంద్రంలో కురిసిన మోస్తరు వర్షంతో వారి ఆశలు చిగురించాయి. సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురియడంతో వరి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్లయింది. మరో రెండు రోజుల పాటుగా వర్షం కురుస్తుందని వాతవరణ శాఖ ప్రకటించడంతో రైతులు సంబరపడుతున్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి లో మహంకాళి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నానన్నారు.

◆ కర్ణాటక ప్రభుత్వ ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శికి అరుదైన గౌరవం దక్కింది. దళితుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్‌సీ మహాదేవప్ప ఆహ్వానించినట్లు మండల పరిధిలోని లింగుపల్లికి చెందిన శంకర్ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25న బెంగుళూరులో నిర్వహిస్తున్న భారత రాజ్యాంగం, దేశ ఐక్యత సదస్సులో పాల్గొనున్నారు.